సాక్షి ఒడిశా

శనివారం । 13 । ఏప్రిల్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 6,13,520
బంగారం	24 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
వెండి	10 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

వేసవి మరింత తీవ్రం



రాష్ట్రంలో ఈ ఏడాది వాతావరణం సరికొత్త రికార్డులతో కొనసాగుతోంది. ఈ నెల 17 నాటికి వేసవి తాపం విపరీతమయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

- 8లో

గంజాయి పట్టివేత



మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి ముండగూఢ కూడలి వద్ద శుక్రవారం రూ.లక్ష విలువైన గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. యువకుడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

- 8లో

పుత్రోత్సాహం దక్కేనా?



- తొలిసారిగా కుమారులను బరిలోకి దించుతున్న రాజకీయ ఉద్ధండులు
- పుత్రుల గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న నేతలు



మంగళా కిషాన్



అనంగ ఉదయ్ సింగ్‌దేవ్



నరసింగ మిశ్రా



జోగేంద్ర బెహెరా




సురేష్ కుమార్ రౌత్రాయ్



ప్రతాప్ జెనా

భువనేశ్వర్: వారంతా రాజకీయ ఉద్ధండులు. ప్రతి ఎన్నికల్లోనూ పోటీ చేస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారు. ఈసారి మాత్రం పోటీకి దూరంగా ఉంటున్నారు. ఇందుకు కారణం తమ కుమారులను బరిలోకి దించడమే. రాష్ట్రంలో వివిధ పార్టీల అభ్యర్థుల ప్రకటన ఓవైపు కొనసాగుతుండగానే, చాలా మంది నాయకులు తమ కుమారులకు ఎన్నికల పోరు బాట సుగమం చేసి ప్రత్యక్ష ఎన్నికల పోటీకి దూరంగా ఉండిపోయారు.

- బొలంగీర్ జిల్లాలో అనుభవజ్ఞుడు, సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే నర్సింగ్ మిశ్రా ఈసారి పోటీ నుంచి వైదొలిగారు. ఆయన బదులుగా తన కుమారుడు సమరేంద్ర మిశ్రాను రంగంలోకి దించారు. బొలంగీర్ స్థానం నుంచి తండ్రి స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా సమరేంద్ర మిశ్రా పోటీకి దిగారు. 2019లో కాంగ్రెస్ టికెట్‌పై సమరేంద్ర మిశ్రా ఎంపీగా పోటీ చేసి విఫలమయ్యారు. నరసింగ మిశ్రా ఇటీవల కాలంలో విపక్ష నాయకుడుగా కీలకపాత్ర పోషించారు. అధికార పక్షానికి పరోక్షంగా మార్గదర్శిగా నిలిచారు. ఆయన ప్రతి ప్రతిపాదన, అభ్యర్థనని అధికార పక్షం పరోక్షంగా అంగీకరించి తదుపరి సమావేశాలు నాటికి చట్టంగా ప్రవేశపెట్టిన దాఖలాలూ లేకపోలేదు. న్యాయ శాఖ మంత్రి, విపక్ష నేతగా పదవులు అలంకరించారు. 1990 దశకం నుంచి నేటి వరకు నిరవధికంగా శాసనసభకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. లొయిసింగ, బినికా, బొలంగీరు నియోజకవర్గాల నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు.
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జోగేంద్ర బెహెరా తన కుమారుడు నిహార్ రంజన్ బెహెరాను లొయిసింగా నియోజకవర్గం నుంచి బరిలో దింపారు. రాజకీయాల నుంచి దృష్టి మరల్చిన యోగేంద్ర తన కొడుకుకు బీజేడీ టికెట్ ఇప్పించారు. జోగేంద్ర బెహెరా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 10వ శాసన సభ నుంచి 15వ శాసన సభ వరకు (14వ శాసన సభ మినహా) టిట్లాగడ్, లొయిసింగ నియోజకవర్గాల నుంచి అసెంబ్లీ సభ్యుడిగా కొనసాగారు. జనతా దళ్ తదుపరి బిజూ జనతా దళ్ అభ్యర్థిగా ప్రాతినిధ్యం వహించారు.
- కలహండి లోక్‌సభ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత బసంత్ పండా కుమారుడు అభినందన్ పండా తొలిసారిగా నువాపడా సదర్ స్థానం నుంచి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. బసంత కుమార్ పండా పశ్చిమ ఒడిశాలో భారతీయ జనతా పార్టీ ఆశాదీపం. 2000లో 12వ శాసనసభ, 2014లో 15వ శాసనసభకు నువాపడా నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. మంత్రి రాజేంద్ర ఢొలొఖియా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ వంటి ఉద్దండులతో ఆయన తలపడనున్నారు.
- బిజూ జనతా దళ్ అభ్యర్థిగా ఆరితేరిన అనంగ్ ఉదయ్ సింగ్ దేవ్ బరి నుంచి తప్పుకుని తన కుమారుడు కలికేష్ నారాయణ్ సింగ్‌దేవ్‌కు మార్గం సుగమం చేశారు. కలికేష్ బొలంగీర్ అసెంబ్లీ స్థానం నుంచి బీజేడీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. గత ఎన్నికల్లో తన వదిన సంగీతా సింగ్ దేవ్ చేతిలో ఓటమికి గురై బొలంగీర్ లోక్‌సభ సీటును కోల్పోయాడు. అనంగ ఉదయ్ సింగ్‌దేవ్ పశ్చిమ ఒడిశా రాజవంశీకుడు. వర్ధమాన ప్రజాస్వామ్య పాలనలో తిరుగు లేని నాయకుడిగా వెలుగొందారు. తొలిసారిగా లొయిసింగ నియోజకవర్గం నుంచి స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా 6వ శాసన సభ (1974 – 77)కు ఎన్నికయ్యారు. తదుపరి
- బొలంగీరు స్థానం నుంచి జనతా దళ్ అభ్యర్థిగా 1990 నుంచి 2000 వరకు 10, 11వ శాసన సభలో కొనసాగారు. ఈ స్థానం నుంచి బిజూ జనతా దళ్ అభ్యర్థిగా 12, 13, 14వ శాసన సభల్లో 2000 నుంచి 2014 వరకు నిరవధికంగా ప్రాతినిధ్యం వహించారు. ప్రతిసారి ఆయన మంత్రిగా బాధ్యతలు నిర్వహించడం విశేషం. బీజేడీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు అత్యంత విశ్వసనీయుడుగా నిలిచారు.



- కాంగ్రెస్ టికెట్‌పై మాజీ మంత్రి భక్త చరణ్ దాస్, ఆయన కుమారుడు సాగర్ చరణ్ దాస్ పోటీ చేస్తున్నారు. భవానీపట్న స్థానాన్ని మూడుసార్లు కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ భక్త చరణ్ దాస్ ఈసారి తన కుమారుడిని రంగంలోకి దించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన సాగర్ చరణ్ దాస్ కాంగ్రెస్ తరపున భవానీపట్న నుంచి పోటీ చేయగా, తండ్రి భక్త చరణ దాస్ ఈసారి నౌర్లా అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. భక్తచరణ దాస్ ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థిగా కలహండి రాజకీయాల్లో విశేష గుర్తింపు సాధించారు. జనతా పార్టీ, జనతా దళ్, కాంగ్రెసు వంటి ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థిగా పలుమార్లు గెలుపొందారు. భవానీపట్న, కలహండి నియోజకవర్గాల నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు.
- మహంగా అసెంబ్లీ స్థానం నుంచి మాజీ మంత్రి ప్రతాప్ జెనా కుమారుడు అంకిత్ ప్రతాప్ జెనా బరిలోకి దిగారు. ప్రతాప్ జెనా బిజూ జనతాదళ్ ప్రభుత్వంలో మాజీ మంత్రి. ఈయన కిస్సన్ నగర్, మహంగ నియోజకవర్గాల నుంచి బీజేడీ అభ్యర్థిగా 2000 నుంచి ఇప్పటి వరకు శాసన సభకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. హత్యారోపణల్ని ఎదుర్కొంటున్నందున విపత్కర పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు బిజూ జనతా దళ్ వ్యూహాత్మకంగా తండ్రికి బదులుగా తనయుడిని బరిలోకి దింపింది.
- ప్రముఖ నేత మంగళ కిసాన్ కుమారుడు అనిల్ బర్వాకు రాజ్‌గంగ్‌పూర్ నియోజకవర్గం నుంచి పార్టీ టికెట్ లభించింది. మంగళా కిసన్ జనతా పార్టీ, బిజూ జనతా దళ్ అభ్యర్థిగా – రాజగంగపూర్ నియోజకవర్గం నుంచి శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. పలుమార్లు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 9, 10, 11, 12, 15వ శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు.
- జట్నీ నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే సురేష్‌కుమార్ రౌత్రాయ్ చిన్న కుమారుడు మన్మథ్ రౌత్రాయ్ ఇటీవలే బీజేడీలో చేరారు. భువనేశ్వర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు చేరిన కొద్ది గంటల్లోనే ఆయనకు పార్టీ టికెట్ కేటాయించింది. ఆరుసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన అతని తండ్రి, తన కొడుకు మన్మథ్ రౌత్రయ్ చర్యతో నిరుత్సాహానికి గురయ్యాడు. సురేష్ కుమార్ రౌత్రాయ్ మాజీ మంత్రి. జట్నీ నియోజక వర్గంలో ప్రజాభిమాన నాయకుడిగా పేరొందారు. అఖిల పక్షాలకు ఆయన ఆదర్శవాదిగా నిలిచాడు. జనతా పార్టీ అభ్యర్థిగా 1977–80 కాలంలో 7వ శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. 1980 నుంచి నేటి వరకు నిరవధికంగా కాంగ్రెసు అభ్యర్థిగా కొనసాగడం విశేషం. ఈ ఏడాది జనవరిలో ఎయిర్ ఇండియాలో పైలట్ ఉద్యోగానికి రాజీనామా చేసి రాష్ట్రానికి తిరిగి రావడంతో ప్రత్యక్ష రాజకీయాల వైపు అడుగు వేశారు. కొడుకుని తన స్థానంలో కాంగ్రెసు అభ్యర్థిగా బరిలోకి దింపుతానని ఆశించి తీవ్ర మనస్తాపానికి గురి అయ్యారు. కొడుకు తన మాటకు కట్టుబడి ఉంటాడనే నమ్మకంతో రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఒక నెల తర్వాత సురేష్ కుమార్ రౌత్రాయ్ ఎన్నికల రాజకీయాల నుండి రిటైర్మెంట్ ప్రకటించారు. అతని కుమారుడు మన్మథ్ రౌత్రాయ్ కాంగ్రెస్ టిక్కెట్‌పై వచ్చే ఎన్నికల్లో జట్నీ అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేస్తాడని నొక్కి చెప్పారు. కొడుకు దారి మార్చి బీజేడీ అభ్యర్థిగా భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగాడు.

న్యూస్‌రీల్

నెక్కంటికి అభినందనలు



నెక్కంటిని అభినందిస్తున్న చంద్రపూర్ సమితి కార్యకర్తలు, నాయకులు

రాయగడ: బీజేపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన రాజ్యసభ మాజీ ఎంపి నెక్కంటికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక రాణిగుడఫారంలో గల ఆయన నివాసానికి ఆయన అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై పుష్పగుచ్ఛాలు అందిస్తున్నారు. చంద్రపూర్ సమితికి చెందిన కార్యకర్తలు, సీనియర్ నాయకులు శుక్రవారం నాడు నెక్కంటిని కలిసి అభినందించారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

మాజీ ఎంపీ చంద్రశేఖర్‌కు అస్వస్థత



చంద్రశేఖర్ సాహు

బరంపురం: బరంపురం బీజేడీ మాజీ ఎంపీ చంద్రశేఖర్ సాహు అస్వస్థతకు గురయ్యారు. గురువారం రాత్రి నగరంలోని పార్టీ సమావేశానికి హాజరైన సమయంలో గుండెపోటు రావడంతో అంబులెన్స్‌లో భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గుండెలో రంధ్రం ఏర్పడిందని, శస్త్రచికిత్స చేయాలని వైద్యులు తెలియజేసినట్లు సాహు బంధువులు చెబుతున్నారు. ఇటీవలే పార్టీ అధిష్టానం చంద్రశేఖర్ సాహును రాష్ట్ర బీజేడీ ఉపాధ్యక్షుడిగా నియమించి సార్వత్రిక ఎన్నికల బాధ్యతను అప్పగించిన విషయం తెలిసిందే.

విసనకర్రలకు గిరాకీ



దేశిబెహెరా వీధిలో విసనకర్రల విక్రయం

బరంపురం: మేరు సంక్రాంతి నేపథ్యంలో బరంపురంలో విసన కర్రలకు గిరాకీ ఏర్పడింది. గంజాం జిల్లాలోని శక్తి పీఠాలకు నిలయమైన వివిధ అమ్మవారి ఆలయాల్లో మేరు సంక్రాంతి ఉత్సవాల నాడు శాంత అమ్మవారికి కొత్త విసన కర్రలు పూజలు చేసి కానుకలుగా ఇవ్వడం ఆనవాయితీ. శనివారం జరిగే ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా భోగాపురం నుంచి భారీగా విసనకర్రలు తెప్పించి విక్రయిస్తున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఈవీఎంలు



యంత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్ర పరుస్తున్న సిబ్బంది

జయపురం: సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన ఈవీఎంలు, వీవీపీహెచ్ మిషన్లు జయపురం విక్రమదేవ్ విశ్వ విద్యాలయానికి చేరుకున్నాయి. వర్సిటీలో గట్టి భద్రతా ఏర్పాట్ల మధ్య ఈవీఎంలను ఉంచారు. జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పొరిడ, జయపురం మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, తహసీల్దార్ మనోలిన ఆచార్య ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాల్వి, నాయకులు

రాయగడ: స్థానిక జేఎస్‌కో సమీపంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్ర దాల్వి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన వివిధ ప్రచార, ప్రసార కార్యక్రమాలు ఇక్కడి నుంచే కొనసాగుతాయని తెలిపారు. అనంతరం రాయగడ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న అప్పలస్వామి కడ్రక, కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న సప్తగిరి శంకర్ ఉలకల ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ సప్తగిరి ఉలక, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గ ప్రసాద్ పండా, డీసీసీ ఉపాధ్యక్షుడు సునీల్ చంద్ర పండ, సాధారణ కార్యదర్శి శంకర్షన్ మంగరాజ్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అస్లామ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కైలాష్ బీజేపీలో చేరిక



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్ సమక్షంలో పార్టీలో చేరిన కైలాష్ కులసిక

కొరాపుట్: కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ మాజీ ఎమ్మెల్యే కైలాష్ కులసిక బీజేడీని వీడి భారతీయ జనతా పార్టీలో చేరారు. గురువారం ఉదయం తాను ఈ నెల 24న బీజేడీ తరఫున నామినేషన్ వేస్తున్నట్లు ఫేస్‌బుక్ సాక్షిగా ప్రకటించిన విషయం తెలిసింది. ఈ పరిణామం వివాదంగా మారింది. పార్టీ టిక్కెట్ ప్రకటించకుండానే కులసిక ప్రకటన చేయడం అధిష్టానానికి చిరాకు తెప్పించింది. దీనిని పార్టీ ధిక్కారంగా భావించింది. దాంతో గురువారం రాత్రి ఆ స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రభు జానీకి మరోసారి టిక్కెట్ ఇస్తున్నట్లు ప్రకటించింది. దాంతో కైలాష్ ఆగ్రహానికి గురయ్యారు. తాను కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు టిక్కెట్ ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు తనకు ఇవ్వలేదని మీడియా ముందు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనువెంటనే బీజేపీ నేతలను సంప్రదించారు. వారి నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్‌మోహన్‌సామల్‌ని కలిశారు. నాటకీయ పరిణామాల మధ్య అర్ధరాత్రి బీజేపీలో చేరారు. శుక్రవారం వేకువజామున ఈ మేరకు ఫేస్‌బుక్‌లో ప్రకటించారు.

సిమెంట్ విక్రయాలు బంద్

పర్లాకిమిడి: కలాసీల లోడింగ్ చార్జీల విషయమై నెలకొన్న వివాదం నేపథ్యంలో గజపతి జిల్లా పర్లాకిమిడి కేంద్రంలో నాలుగు రోజులుగా సిమెంట్, ఐరన్ విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో రాణిపేట, పర్లాకిమిడి, జాజిపూర్ తదితర ప్రాంతాల్లో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గజపతి సిమెంట్, ఐరన్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు సింహాచల పట్నాయక్, కార్యదర్శి జె.విజయకుమార్‌లు పాతపట్నం రోడ్డులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సిమెంట్ లోడింగ్, అన్‌లోడింగ్ కలాసీల చార్జీలు రూ.10.40 ఉండేవని, ఇప్పుడు రూ.14.40 ఇవ్వాలని కలాసీలు అడుగుతున్నారని చెప్పారు. దీంతో లోడింగ్ చార్జీల భారం కష్టమర్లపై భారం పడుతోందని, అందుకే విక్రయాలు తాత్కాలికంగా బంద్ చేశామని చెప్పారు. కలాసీలు చార్జీలు తగ్గించుకుని దిగివస్తే లావాదేవీలు పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సంఘ కోశాధికారి తంగుడు భాస్కరరావు, పెద్దిని బద్రీనాథ్, బరాటం సంతోష్, బోయిన రవికుమార్, వైశ్యరాజు కళ్యాణ్ రాజు, శాసనపురి సంతోష్, ప్రదీప్ చౌదురి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్ష కార్యదర్శులు సింహాచల పట్నాయక్, జె.విజయకుమార్

మాజీ మంత్రి కమలాదాస్ కన్నుమూత



కమలాదాస్(ఫైల్)

భువనేశ్వర్ : రాష్ట్ర మాజీ ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి కమలాదాస్ (79) శుక్రవారం కన్నుమూశారు. కటక్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత రాత్రి మరణించారు. భొగరాయ్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కమలాదాస్ 15 రోజుల క్రితం ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ సమస్యతో చికిత్స కోసం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అనంతరం ఆమెను కటక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మూడు రోజులుగా వెంటిలేటర్‌పై ఉంటూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆమె 1995, 2000, 2004లో శాసనసభకు ఎన్నికయ్యారు. ఈమె మృతి పట్ల ముఖ్యమంత్రి, గవర్నర్ తదితర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె పార్థివ దేహాన్ని స్వగ్రామమైన భొగరాయ్‌కు తరలించి హిందూ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

బరంపురం సర్కిల్ జైల్లో నిఘా పెంపు



భారీ భద్రత మధ్య బరంపురం సర్కిల్ జైలు

బరంపురం: బరంపురం సర్కిల్ జైలులో నేరస్తుల సంఖ్య పెరగడంతో అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. జైల్లో విచారణ ఖైదీలుగా ఉంటున్న గ్యాంగ్‌లు, ప్రత్యర్థుల మధ్య ఎలాంటి దాడులు జరగకుండా సీసీ కెమెరాలతో పాటు జామర్లు ఏర్పాటు చేశారు. జైల్ ప్రహరీ బయట కూడా భద్రత పెంచినట్లు జైలు అధికారి రవీంద్ర కుమార్ తెలియజేస్తున్నారు.



బరంపురం సర్కిల్ జైలు చుట్టూ భారీ భద్రత



సీసీ కెమెరాల నిఘాలో బరంపురం సర్కిల్ జైలు

అగ్ని బారి నుంచి కాపాడారు



పకులగుడ గ్రామ సమీపంలో అడవిలో మంటలను ఆర్పుతున్న స్వయం సహాయక గ్రూపు మహిళలు

జయపురం: అగ్ని జ్వాలల నుంచి అడవులను కాపాడేందుకు కొన్ని స్వయం సహాయక మహిళా గ్రూపులు నడుం బిగించాయి. ముఖ్యంగా జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో గల అడవుల్లో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అగ్ని ప్రమాదాల నుంచి అడవులను పరిరక్షించేందుకు నాలుగు మహిళా స్వయం సహాయక గ్రూపుల్లో 40 మంది సభ్యులు నడుంబిగించారు. గురువారం రాత్రి పకులగుడ ప్రాంతం అడవిలో భారీగా మంటలు పుట్టి చెట్లను దహించి వేస్తుండటం చూసిన మహిళలు రాత్రి అని చూడకుండా సంఘటనా ప్రాంతానికి వెళ్లి మంటలను ఆర్పారు. నీరు కూడా అందుబాటులో లేకపోయినా చెట్ల కొమ్మలతోనే మంటలను ఆర్పారు. వారు చూపిన సమయస్ఫూర్తికి, ధైర్యానికి గ్రామస్తులు వారిని కొనియాడుతున్నారు. మంటలను ఆర్పి విలువైన అడవులను రక్షించిన మా బృందావతి,మా కంతేశ్వరి,మా తుసీ,లొకి స్వయం సహాయక మహిళలను పలువురు ప్రశంసించారు. కొరాపుట్ జిల్లాలోగల మహిళా స్వయం సహాయక గ్రూపులు బొయిపరిగుడ మహిళా స్వయం సహాయక గ్రూపులను ఆదర్శంగా తీసుకొని అడవులు అగ్ని ప్రమాదాల నుంచి కాపాడేందుకు ముందుకు రావాలని కోరుతున్నారు.

వేర్వేరు చోట్ల 105 కిలోల గంజాయి సీజ్



గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసిన గుసానినువగాం పోలీసు అధికారులు



15 కిలోల గంజాయి సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేసిన సురదా అబ్కారీ అధికారులు

బరంపురం: బరంపురం జిల్లా పోలీసు పరిధి 16వ నంబర్ జాతీయ రహదారిపై బైక్‌లో అక్రమంగా తరలిస్తున్న 90 కిలోల గంజాయితో పాటు బైక్ ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. బరంపురం ఎస్పీ సార్థక సడంగి అందించిన సమాచారం మేరకు.. ఖ్లికోట్ నుంచి 16వ నంబర్ జాతీయ రహదారి మీదుగా బరంపురం వైపు వస్తున్నా ఒక బైక్‌లో గంజాయి తరలిస్తున్నట్లు శుక్రవారం ముందస్తు సమాచారం అందింది. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు గుసానినువగాం పోలీసులు అధికారుల బృందం జాతీయ రహదారిలో రెక్కీ నిర్వహించి కొణిసి సమీపంలో బైక్‌ను ఆపి 90 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి తుపాకీ, రెండు గుళ్లు, మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాం పోలీసు జిల్లా పరిధి అస్కా–సురడా రహదారి మధ్య కొందమాల్ నుంచి బైక్‌పై అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

కారు బోల్తాపడి నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

బరంపురం: రాయగడ నుంచి బరంపురం వెళ్తున్న కారు శుక్రవారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో తప్తపాణి ఘాట్‌రోడ్డులో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, ఒడ్రాఫ్ బృందం కలిసి కారులో చిక్కుకున్న క్షతగ్రాతులను బయటకు తీసి తొలుత దిగపండి ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రూ.లక్ష విలువైన గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయితో నిందితుడు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి ముండగూఢ కూడలి వద్ద శుక్రవారం పోలీసులు రూ.లక్ష విలువైన గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ యువకుడు తలపై బస్తా పెట్టుకుని రావడాన్ని గమనించారు. పోలీసులు ఆపి తనిఖీ చేయగా 20 కిలోల గంజాయి గుర్తించారు. వెంటనే ఈ యువకుడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ యువకుడు మత్తిలి సమితి సింధిబేడ గ్రామానికి చెందిన ప్రహంత్ నాయిక్ (26)గా గుర్తించారు. గంజాయిని చత్తీస్‌గఢ్‌కు తీసుకెళ్తున్నట్లు అతను తెలిపాడు.

యువకుడి అనుమానాస్పద మృతి



పట్టాలపై హరికృష్ణ మృతదేహం

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ పరిధిలోని కాశీబుగ్గ ఎల్‌సీ గేటు రైలు పట్టాలపై శుక్రవారం ఉదయం ఓ యువకుడు చనిపోయిన ఘటన కలకలం రేపింది. పలాస జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ కేసు నమోదు చేసిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..

కాశీబుగ్గ ఎల్‌సిగేటు సమీపంలో రైలు పట్టాలపై యువకుడి మృతదేహం ఉందని స్థానికుల నుంచి సమాచారం వచ్చింది. జీఆర్పీ పోలీసులు మృతదేహం వద్దకు చేరుకుని విచారణ ప్రారంభించగా.. మృతుడు పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టి మండలం గొప్పిలి గ్రామానికి చెందిన కూర్మాపు హరికృష్ణ (21)గా తేలింది. వెంటనే అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని గొప్పిలి తరలించారు.

అనుమానాస్పదం..

యువకుడు చనిపోయే ముందు తన సామాజిక మాధ్యమాల ఖాతాల్లో పెట్టిన పోస్టులు అతడి మృతిపై అనుమానం రేకెత్తించేలా చేస్తున్నాయి. యువకుడు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడని, తన ఊరికి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ప్రేమలో పడ్డాడని, కానీ వారి కుటుంబ సభ్యులకు తెలిసి వేధింపులకు గురి చేశారని అతని సన్నిహితులు చెబుతున్నారు. శుక్రవారం మరణించడానికి ముందు ఇన్‌స్టాగామ్‌లో తన ప్రేయసితో ఉన్న ఫొటోలను పోస్టు చేశాడు. దీంతో అతడి మృతిపై సన్నిహితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుమారుడి మరణంపై మాట్లాడే అవకాశం సైతం లేకపోవడంతో తల్లిదండ్రుల బాధను చూసి పలువురు ఆవేదన చెందుతున్నారు.

వ్యాను ఢీకొని వృద్ధునికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని పాట్టి శ్రీరాములు కూడలి వద్ద శుక్రవారం మధ్యాహ్నం 70 ఏళ్ల వృద్ధుడిని వ్యాను ఢీకొని గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్‌ఐ సందీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గూనపాలెం సమీప కొత్త మేదరవీధికి చెందిన యాదం రమణమూర్తి బోడెమ్మకోవెల వద్ద రంగా చికెన్ సెంటర్‌లో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం షాపు మూసిన వెంటనే ఇంటికి నడుచుకుని వస్తుండగా పాట్టిశ్రీరాములు కూడలి వద్ద వెనుకగా వ్యాను వచ్చి ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై రమణమూర్తి పడిపోగా వ్యాను ముందు టైరు ఎడమకాలును తొక్కుతూ ముందుకుపోయింది. దీంతో ఎడమకాలు పాదం తీవ్రగాయమై రక్తస్రావమైంది. వెంటనే ఆటోలో వృద్ధుడిని రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠాపన



కొత్తగా నిర్మించిన లక్ష్మీనారాయణ ఆలయం



అనూప్ జల్తా గజల్ కార్యక్రమం

రాయగడ: జిల్లాలోని కాశీపూర్ సమితి టికిరిలో గల ఉత్కళ అల్యూమినియం కర్మాగారం ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన లక్ష్మీనారాయణ మందిర ప్రతిష్టాపన ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల 8వ తేదీ నుంచి కలశ యాత్రతో ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం విగ్రహ ప్రాణప్రతిష్ఠ, సింహాసన అధిరోహరణం, ప్రసాద వితరణ కార్యక్రమాలతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కర్మాగారం యూనిట్ హెడ్ మజార్‌బేగ్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులను ఈ సందర్భంగా మజూర్ బేగ్ దంపతులు సన్మానించారు. శుక్రవారం సాయంత్రం అనూప్ జల్తా నిర్వహించిన గజల్ కార్యక్రమం అలరించింది.



కళాకారులను సన్మానిస్తున్న మజార్ బేగ్ దంపతులు

వేసవి మరింత తీవ్రం



భువనేశ్వర్: రాష్ట్రంలో ఈ ఏడాది వాతావరణం తరచూ సరికొత్త రికార్డులతో కొనసాగుతోంది. ఈ నెల 11 గురువారం పగటి ఉష్ణోగ్రతలో గణనీయమైన తగ్గుదల కారణంగా రాష్ట్రంలో పలు ప్రాంతాలు చల్లబడ్డాయి. అయితే ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నెల 17 నాటికి వేసవి తాపం విపరీతమయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ఐఎండీ ముందస్తు అంచనాలు జారీ చేసింది. ఆ రోజుకి పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రత 43 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఐఎండీ ప్రాంతీయ కేంద్రం సమాచారం. ఈ నెల 13 తర్వాత పశ్చిమ, వాయువ్య దిశల నుంచి పొడి గాలి ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల పాటు పగటి ఉష్ణోగ్రత 6 నుండి 8 డిగ్రీల సెల్సియస్ వరకు పెరుగుతుంది. క్రమంగా ఈ నెల 17 నాటికి 43 నుంచి 44 డిగ్రీల సెల్సియస్‌ను ఉష్ణోగ్రత తాకుతుంది.

స్థానిక ఐఎండీ సీనియర్ వైజ్ఞానికుడు ఉమా శంకర్ దాస్ మీడియాతో మాట్లాడుతూ, వాతావరణం మధ్య, ఎగువ భాగంలో ద్రోణి కారణంగా రాష్ట్రంలో మేఘావృతమైన వాతావరణం నెలకొంటుందని, ఈ నెల 13 తర్వాత ఉష్ణోగ్రత పెరగడం ప్రారంభమవుతుందని, ఏప్రిల్ 17 నాటికి 43–44 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుని తీరప్రాంతాల్లో అధిక తేమ కలిగి ఉంటుందని వివరించారు. పశ్చిమ గాలుల అవాంతరాల ప్రభావంతో 10 జిల్లాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

వడగాడ్పుల హెచ్చరిక

ఈ నెల 15న కటక్, నయాగఢ్, మల్కన్‌గిరి, కొరాపుట్, అంగుల్ మరియు ఢెంకనాల్ జిల్లాలకు, ఏప్రిల్ 16న కెంజొహార్, మయూర్‌భంజ్, జాజ్‌పూర్, ఢెంకనాల్, అంగుల్, నయాగఢ్, బౌధ్, కటక్, కంధమల్, కొరాపుట్, మల్కన్‌గిరి, బాలాసోర్, మల్కన్‌గిరి ప్రాంతాలకు వడగాడ్పుల హెచ్చరికలు జారీ చేశారు. ఈ వ్యవధిలో పశ్చిమ–వాయువ్య గాలుల ప్రవాహంతో వేడిమి తీవ్ర స్థాయికి పెరిగే అవకాశం ఉంది. 24 గంటల తర్వాత పగటి ఉష్ణోగ్రత క్రమంగా 6 నుంచి 8 డిగ్రీల సెల్సియస్ పెరుగుతుందని వాతావరణ సంస్థ అంచనా వేసింది. ఈ నెల 16 నాటికి భువనేశ్వర్‌లో పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉంది.

ఓటు హక్కు వినియోగం తప్పనిసరి



మాట్లాడుతున్న నిహారి రంజన్, పక్కనే సబ్ కలెక్టర్ కల్యాణి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక శాతం పోలింగ్ నమోదయ్యేలా జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోందని నోడల్ అధికారి నిహారి రంజన్ కుహరో తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో శుక్రవారం పలు సంస్థలు, క్లబ్‌లకు చెందిన ప్రతినిధులు, అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో 75 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని, ఈసారి కనీసం 85 శాతం పోలింగ్ జరగాలని కోరారు.

జిల్లాలోని గుణుపూర్ సబ్‌డివిజన్ పరిధిలో నివసిస్తున్న లంజియా సవర, రాయగడ సబ్ డివిజన్ పరిధిలో నివసిస్తున్న డొంగిరియా తెగలకు వారి భాషల్లోనే ఓటు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని నోడల్ అధికారి చెప్పారు. సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి మాట్లాడుతూ ఎండలు మండుతున్నందున అధిక శాతం మంది గ్రామీణులు విసనకర్రలు వినియోగిస్తుంటారని, ఈ నేపథ్యంలో వాటిపైనే ఓటు ఆవశ్యకత తెలియజేసేలా ప్రత్యేకంగా ముద్రించాలని చెప్పారు. ఈ మేరకు పలు ప్రత్యేక విసనకర్రలను ఆమె ప్రదర్శించారు.

తులసి–రావిచెట్ల వివాహ వేడుక



వృక్షాలకు వివాహం జరిపిస్తున్న దృశ్యం

రాయగడ: ప్రకృతి పరిరక్షణలో భాగంగా రాయగడలో రావి(వటవృక్షం) చెట్టు, తులసి మొక్కలకు వివాహంజరిపించారు. హైందవ సాంప్రదాయం ప్రకారం విష్ణు స్వరూపుడైన వటవృక్షానికి, లక్ష్మీ స్వరూపమైన తులసి మొక్కకు శుక్రవారం రాయగడలోని చెక్కాగుడ వద్ద ప్రేమ్ పహడ్ ప్రాంగణంలో ఈ వేడుక జరిపించారు. వ్యాపారవేత్త ఎస్.వీరబాబు, నాగేశ్వరమ్మల సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమానికి వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సహకరించారు. మగపెళ్లివారి తరపున వీరబాబు దంపతులు, ఆడపెళ్లి వారి తరపున జి.వినోద్ బాబు, మాధవి దంపతులు పాల్గొన్నారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భారీగా జనం హాజరయ్యారు.



పెళ్లి సామగ్రిని ఊరేగింపుగా తీసుకొస్తూ..

● చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం వద్ద నిర్వాహకులు

పర్లాకిమిడి: ప్రగతి మహిళా సంఘటన్, యూటెక్ కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ సెంటర్ ఆధ్వర్యంలో రాజావారి ప్యాలెస్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విశ్రాంత ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ హరిమోహన్ పట్నాయక్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రగతి మహిళా సంఘటన్ కార్యదర్శి తనుజా శథపతి, అధ్యాపకురాలు డాక్టర్ భారతీ పాణిగ్రాహి, యూటెక్ కంప్యూటర్స్ పర్యవేక్షకులు లోకనాథ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి తెలంగాణ సీఎం రేవంత్



రేవంత్ రెడ్డి

రాయగడ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒడిశా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని కొరాపుట్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సప్తగిరి ఉలక శుక్రవారం తెలిపారు. మే మొదటి వారంలో సీఎం పర్యటన ఖరారవుతుందని చెప్పారు. రాయగడ, బిసంకటక్, ,గుణుపూర్ శాసనసభ నియోజకవర్గాల్లో రోడ్‌షో ఉండే అవకాశముందన్నారు. రాయగడ జిల్లాలో అత్యధిక శాతం మంది తెలుగు ఓటర్లు ఉండటంతో రేవంత్ ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా పర్యటించనున్నారని పేర్కొన్నారు.

జై భజరంగ భళీ..!

జయపురంలోని బిద్యాధర సింగ్‌దేవ్ దైనికబజారులో వీర హనుమాన్ ఆలయ రజతోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. చిరంజీవి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలలో గణేష్ పూజతో ప్రారంభమై రక్షాబంధన, కలశ స్థాపన, హనుమాన్ మాలధారణ తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ నెల 14 వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. – జయపురం



హనుమాన్ మాలాధారణ



మంత్ర పుష్ప పూజలు



వీర హనుమాన్ విగ్రహం



దుర్గాసూక్త పారాయణం

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

బూర్జ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చెక్ పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. మండలంలో గల మదనాపురం జంక్షన్‌లో ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆమె శుక్రవారం పరిశీలించారు. రికార్డులను తనిఖీలు చేసి, సిబ్బంది సమయ పాలనపై ఆరా తీశారు. పరిసరాలను పరిశీలించారు. ప్రధానంగా అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం – పాలకొండ రహదారిపై వస్తున్న వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరు, వీడియో రికార్డింగ్ చేస్తున్న విధానాలపై సిబ్బందికి అడిగి తెలుసుకొని పలు సూచనలు, సలహాలు అందజేశారు.



మదనాపురం జంక్షన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

అమ్మో కోతులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలో చిన్నబొందిలీపురం, బొందిలీపురం, రాయివీది తదితర ప్రాంతాల్లో కోతుల గుంపు ప్రజలను ఇబ్బంది పెడుతోంది. పది రోజులుగా కోతుల గుంపు ఆ ప్రాంతంలోకి వచ్చి తిష్ట వేశాయి. ఇళ్లలోకి దూరి ఆహారాన్ని తినేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు, మహిళలపై దాడులకు కూడా దిగాయని అంటున్నారు. రెండు నెలల పసికందుపై కూడా ఓ కోతి దాడి చేసిందని తెలిపారు. అటవీశాఖ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గంజాయి పట్టివేత

టెక్కలి రూరల్: స్థానిక నాలుగురోడ్ల జంక్షన్ మెళియాపుట్టి రోడ్డులో శుక్రవారం వాహన తనిఖీల్లో 1.3 కిలోల గంజాయిని టెక్కలి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కూర్మనాథపురం గ్రామానికి చెందిన కోట గణేష్ అనే వ్యక్తి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అతను ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి వెళ్లి అక్కడ కె.మణికంఠ, కూన చింతాని అనే ఇద్దరు వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి తిరిగి టెక్కలి వస్తుండగా సీఐ షైదయ్య జరిపిన వాహన తనిఖీల్లో దొరికిపోయాడు. వారిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మొదటి విడత ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) మొదటి విడత ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్దేశిత వెబ్‌సైట్‌లో శుక్రవారం పూర్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈవీఎం గోదాం వద్ద ప్రక్రియ నిర్వహించారు. ఈవీఎంలు ఈ నెల 21, 22 తేదీల్లో ఆయా నియోజకవర్గాలకు చేరవేయనున్నామని ఆయన తెలిపారు. ఈ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈవీఎంల పరిశీలన అనంతరం ఆయన పార్టీ ప్రతినిధులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, ఈవీఎంల నోడల్ అధికారి జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధా, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ జయప్రకాశ్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

16న భద్రాచలంకు ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో భద్రాచలంకు ఆర్టీసీ బస్సులు నడపనుందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు తెలిపారు. ఈనెల 16వ తేదీన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి భద్రాచలంకు మొట్టమొదటిసారిగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని తెలిపారు. భద్రాచలంకు వెళ్లే భక్తులు తమ టికెట్‌లు, ఇతర వివరాలకు 7382921647, 7382919694 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రామభక్తులు, ప్రజలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని డీసీసీబీ కాలనీలో నివాసం ఉంటున్న కింతలి శ్రీవాణి (30) ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకొంది. రూరల్ పోలీసులు అందించిన వివరాలు మేరకు.. శ్రీవాణి, ఆమె భర్త హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగాపనిచేసేవారు. కోవిడ్ తర్వాత వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిలో ఇంటి వద్దే పనిచేస్తున్నారు. అయితే ఆమెకు పిల్లలు లేకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. భర్త హరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెరవేరిన ఆశ

- మెరుగుపడిన జీవితం
- ప్రతి నెల రూ.10 వేల గౌరవ వేతనం, సమాజంలో గౌరవం
- జగనన్న ప్రభుత్వం రాకతో మారిన బతుకు
- జిల్లావ్యాప్తంగా 1,785 కుటుంబాల్లో వెలుగులు

రాజాం: గతంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆశ కార్యకర్తలంటే చిన్నచూపు ఉండేది. గ్రామాల్లో హెల్త్ సెంటర్లు లేక, వైద్య సిబ్బంది స్థానికంగా ఉండలేని పరిస్థితుల్లో ఆశ కార్యకర్తలే వైద్యానికి పెద్దదిక్కుగా ఉండేవారు. ఏ గ్రామంలో విషజ్వరాలు వచ్చినా ముందు బాధ్యత తీసుకునేది ఆశ కార్యకర్తలే. చిన్నారులు, గర్భిణులకు టీకాల నుంచి ప్రతి ఇంటికి ఫీవర్ సర్వే చేసిన ఆశ కార్యకర్తలకు ప్రతి నెలా కనీసం రూ.2 వేలు గౌరవ వేతనం చెల్లించలేని స్థితిలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కాలం నెట్టుకొచ్చింది. ఒత్తిడి పెరిగి కనీస వేతనం, గౌరవం లేక జిల్లాలోని ఆశ కార్యకర్తలు ఒక్కొక్కరు సేవల నుంచి స్వచ్ఛందంగా వైదొలిగేవారు.

ఇప్పుడు..

ఆశ కార్యకర్తల ఉద్యోగానికి డిమాండ్ పెరిగింది. ప్రతి ఆశ కార్యకర్తకు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం చెల్లిస్తోంది. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు వెలిశాయి. అక్కడ ఆశ కార్యకర్తలు ఉండేందుకు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. పనిభారం తగ్గించడంతో పాటు ఆశ కార్యకర్తలకు విలువైన వైద్య సేవలు అప్పగించారు. కోవిడ్ సమయంలో ఆశ కార్యకర్తలు ప్రతి గ్రామంలో ప్రజలను ఆదుకున్నారు. సేవలకు తగిన వేతనంతో పాటు గ్రామాల్లో గౌరవం దక్కడంతో ఇప్పుడు ఆశ కార్యకర్తగా చేరి, సేవలు అందించేందుకు పోటీ ఏర్పడుతోంది. కొత్త ఆశ కార్యకర్తలను భర్తీచేసే సమయంలో ఇంటర్మీడియట్, డిగ్రీ చదివే అభ్యర్థులు కూడా ముందుకు వస్తున్నారు. ఆశ కార్యకర్తలకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కల్పించిన గౌరవం ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తోంది.



ఓ కార్యక్రమంలో ఆనందంగా పాల్గొన్న ఆశ కార్యకర్తలు (ఫైల్)

కార్యకర్తల కుటుంబాల్లో వెలుగులు

పదోతరగతి చదివి ఏ ఉద్యోగం లేక ఆశ కార్యకర్తలుగా చాలా గ్రామాల్లోని మహిళలు విధుల్లో చేరేవారు. వారికి నెలకు పనికి తగిన విధంగా రూ.1000 నుంచి రూ. 2 వేలు గౌరవ వేతనం వచ్చేది. అది కూడా ఏ ఆరు నెలలకో..ఏడాదికో అందేది. చిన్నారులకు టీకాలు వేసే కార్యక్రమం దగ్గర నుంచి గర్భిణులను ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు డెలివరీకి తరలించే పనివరకూ ప్రతి కార్యక్రమం ఆశ కార్యకర్తలమీదే ఉండేది. పనికి తగిన వేతనం లేక, రాజకీయ ఒత్తిళ్లు అధికమవడంతో జిల్లాలో చాలామంది ఆశా కార్యకర్తలు రిజైన్ చేసి ఇంటిపట్టునే ఉండేవారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశ కార్యకర్తల కష్టాలు గుర్తించారు. ప్రతి నెల రూ. 10 వేల గౌరవ వేతనాన్ని ప్రకటిస్తూ జీఓ విడుదలచేశారు. ఈ నిర్ణయంతో ఆశ కార్యకర్తల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా ఈ ఉద్యోగాలకు డిమాండ్ పెరిగింది. ఖాళీగా ఉన్న స్థానాలు సైతం భర్తీ అయ్యాయి. సీఎం నిర్ణయంతో జిల్లాలోని 1785 మంది ఆశ కార్యకర్తలకు ప్రతి నెల రూ.10 వేల గౌరవ వేతనం అందుతోంది. అంతేకాకుండా వారిపై రాజకీయ ఒత్తిళ్లు కూడా తొలగాయి. ప్రస్తుతం జిల్లాలోని ఆశ కార్యకర్తల కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడి కొత్త జీవితాన్ని కొనసాగిస్తున్నాయి.

నేడు వైఎస్సార్‌సీపీ మహిళా ర్యాలీ



మహిళా ర్యాలీని విజయవంతం చేయాలంటూ విజయ చిహ్నం చూపిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్‌లు

- విజయనగరంలో 6000 మందితో ప్రచారం
- కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి

విజయనగరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున విజయనగరం శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌లకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం విజయనగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిలు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్వహించ తలపెట్టిన ర్యాలీలో నియోజకవర్గంలోని మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం 5 గంటలకు నగరంలోని సీఎంఆర్ జంక్షన్ నుంచి కోట జంక్షన్ వరకు 6000 మంది మహిళలతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువభేరి, సీనియర్ సిటిజన్స్ సమ్మేళనం విజయవంతం కావడంతో మరింత ఉత్సాహంతో మహిళా ర్యాలీని చేపడుతున్నట్లు వివరించారు.

సీఎంఆర్ జంక్షన్ వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ జంక్షన్, దాబా గార్డెన్స్, కన్యకాపరమేశ్వరి కోవెల, గంటస్తంభం, మూడులాంతర్లు మీదుగా కోట జంక్షన్ వరకు సాగుతుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నిర్మల, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్‌లు పిన్నింటి కళావతి, ఆశపు సుజాత, రేగాన రూపాదేవి, ఆల్తి సత్యకుమారి, పట్నా ఆదిలక్ష్మి, దుప్పాడ సునీత, దాసరి సత్యవతి, బొద్దూరు గోవిందమ్మ, నాయిన పద్మలతో పాటు వివిధ డివిజన్‌ల మహిళా ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఈవీఎం గొడౌన్ల పరిశీలన



ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురంటౌన్: గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలను జాయింట్ కలెక్టర్ శోభికతో కలిసి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ నిబంధనలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ప్రతి మూడు నెలలకోసారి ఈవీఎంలను పరిశీస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి జి.శివకేశవనాయుడు, ఇతర అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

- ఆర్డీఓ హేమలత

పార్వతీపురం టౌన్: ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓ కీలక పాత్ర, విధులు అత్యంత ప్రతిష్టాత్మకమని ఆర్డీఓ, పార్వతీపురం ఎన్నికల అధికారి హేమలత అన్నారు. పీఓగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఒక్క తప్పు కూడా జరగకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీప్యాట్ల పనితీరుపై పీఓలు, ఏపీఓలు సంపూర్ణ అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఈ మేరకు శనివారం ఆర్డీఓ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పార్వతీపురం నియోజకవర్గం సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర అత్యంత కీలకమని, పోలింగ్ రోజున, సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓదే పూర్తి అధికారమని చెప్పారు. అందరి విధులపైనా పీఓలకు అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. ప్రతి చోటా పోలింగ్‌కు 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్‌పోల్ నిర్వహించాలని చెప్పారు. మాక్‌పోల్ అనంతరం ఈవీఎంలు డిలీట్ చేయాలని, వీవీప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుబడ్డ మద్యం సీసాలతో ఎస్ఐ సూర్యకుమారి

భోగాపురం: మండలంలోని మహారాజుపేట గ్రామ పరిధిలో శుక్రవారం సాయంత్రం పాన్ షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న అక్రమానీ అప్పయ్యమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు. ఆమె నుంచి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

గాయత్రి, శ్రీ గాయత్రి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ మురళి, యాజమాన్యం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ గాయత్రి కాలేజీ కరస్పాండెంట్ జగదీశ్వరి

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో గల గాయత్రి, శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. గాయత్రి జూనియర్ కళాశాలకు సంబంధించి ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో గురాన కృష్ణ, కిలారి నీలిమ, నడూపూరి రవీంద్రలు 984 మార్కులు, బైపీసీలో ఆల్తి దివ్య 974, వాకాడ సౌమ్య 963 మార్కులు సాధించారు. ప్రథమ సంత్సరం ఎంపీసీలో బాలి సింధు, ముక్కా మణి, ఆవాల సాయిలు 461 చొప్పున మార్కులు, బైపీసీలో డి.దుర్గాప్రసాద్ 430, రొంగలి సింధూజ 429 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.మురళితెలిపారు. శ్రీ గాయత్రి కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో లెంక అరవింద్ 988, బైపీసీలో డి.హేమలత 974 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఆర్.ఆశ 463, బైపీసీలో కె.నిహారిక 422 మార్కులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ జి.ఎరుకునాయుడు తెలిపారు.

ఖాళీ అవుతున్న టీడీపీ..!

- వైఎస్సార్‌సీపీలోకి ఉమ్మడి జిల్లాలో భారీగా వలసలు

పార్వతీపురంటౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుతున్న పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతిరోజూ ఉమ్మడి జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి అధికార వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ క్రమంలో పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ టిక్కెట్ పొందిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు అండగా నిలిచేందుకు ప్రతిపక్ష టీడీపీ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పార్వతీపురం మండలంలోని రావికోన పంచాయతీలోని అడ్డూరువలస సచివాలయం కన్వీనర్ రామకృష్ణ ఆధ్వర్యంలో 55 కుటుంబాలు ఎమ్మెల్యే జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే జోగారావు పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలుకుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలుపు కోసం కలిసికట్టుగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం నియోజకవర్గం నుంచి భారీ ఆధిక్యాన్ని జగనన్నకు బహుమతిగా అందజేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

వెల్దూరులో 75 కుటుంబాల చేరిక..

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లు చేసిన పరిపాలనకు ఆకర్షితులై పూసపాటిరేగ మండలంలోని వెల్దూరు, కిలుగుపేట, కాలపురెడ్డిపేట గ్రామాలకు చెందిన 75 కుటుంబాల వారు టీడీపీని వీడి నెల్లిమర్ల ఎమ్మెల్యే బద్దుకొండ అప్పలనాయుడు సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ నాయకుడు బోయ సూరిబాబుతో సహా పార్టీలో చేరిన 75 కుటుంబాల వారికి ఎమ్మెల్యే బద్దుకొండ అప్పలనాయుడు, పార్టీ నాయకులు పతివాడ అప్పలనాయుడు, దారపు గున్నారెడ్డిలు కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని పార్టీలో చేరిన వారందరూ ముక్తకంఠంతో తెలియచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ నెల్లిమర్ల నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో జరిగాయని, ఏ గ్రామంలో చూసినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కనపడుతున్నాయన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రెండవసారి ప్రమాణస్వీకారం చేసిన తరువాత అరకొరగా మిగిలిన పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మంచి జరిగిందంటేనే ఓటేయండని అడిగిన దమ్మున్న నాయికుడు జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసురావు, మహంతి జనార్ధనరావు, దారపు అప్పలసూర్రెడ్డి, అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు

విజయనగరంలో 20 కుటుంబాలు

విజయనగరం: విజయనగరం నియోజకవర్గం పరిధిలో ప్రతిపక్ష టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, స్థానికంగా ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులవుతున్న పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని శాంతినగర్‌కు చెందిన గుండు ఉమామహేశ్వర రావుతో పాటు ఆయన అనుచరులు 20 కుటుంబాల వారు టీడీపీకీ గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అజీజ్, ఎస్‌కె మున్నా, అబ్దుల్లా, ఆతం చిన్న తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి ఆహ్వానించిన ఎమ్మెల్యే బద్దుకొండ అప్పలనాయుడు, పతివాడ అప్పలనాయుడు తదితరులు



విజయనగరం: టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో రాజేష్, వేణు, తవిటిరాజులు

బైక్‌ను బస్సు ఢీకొని..

- వేపాడ మండల యువకుడి మృతి
- విశాఖలో జరిగిన ప్రమాదం



రాజ్‌కుమార్ (ఫైల్)

వేపాడ: మండలంలోని పెదకృష్ణరాజపురం గ్రామానికి చెందిన బి.రాజ్‌కుమార్ (30) విశాఖలో బస్సు ఢీ కొన్న ప్రమాదంలో అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదంపై స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖలోని ఆస్పత్రికి వైద్యం నిమిత్తం రాజ్‌కుమార్ ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో విశాఖలోని రామా టాకీస్ సమీపంలో ట్రావెల్స్ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో రాజ్‌కుమార్ రోడ్డుపై పడిపోయి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి అప్పారావు బొద్దాంలోని చర్చిలో పాస్టర్‌గా ఉన్నారు. తల్లి లక్ష్మి గృహిణి. రాజ్‌కుమార్ డిగ్రీ పూర్తి చేసి కేరళలో పాస్టర్ ట్రైనింగ్ అవుతున్నాడని ఈ మధ్యనే గ్రామానికి వచ్చినట్లు స్థానికులు చెప్పారు.

వైద్యసేవలు మరింత విస్తృతం

- జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి జగన్మోహనరావు



ఎం.సింగుపురంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్మోహనరావు

పాలకొండ రూరల్: గ్రామ స్థాయిలోని పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు వైద్యసేవలు మరింత విస్తృతంగా అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బగాది జగన్మోహనరావు అన్నారు. పాలకొండ మండలం ఎం.సింగుపురం, వీరఘట్టం మండలం బీటీ వాడ పీహెచ్‌సీలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రిజం-10 అమలు తీరుపై ఆరా తీశారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, కాలం చెల్లిన మందులు నిల్వ ఉంచరాదని, స్టోర్‌లో మందులు ఏ టూ జెడ్ వరుసలో అమర్చాలని సిబ్బందికి సూచించారు. వ్యాక్సిన్ల నిల్వలు, ఇండెంట్ రికార్డులు సరిపోల్చారు. వైద్యశాఖ ఉన్నతాధికారుల సూచనలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసి, ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆయన వెంట వైద్యులు నితీషా, శంకర్, యోగేశ్వరరెడ్డి, ఈఓలు శ్రీనివాసరావు, రామారావు, తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన తప్పనిసరి

సీతంపేట: ఎన్నికల నియమ, నిబంధనలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిషాంత్‌కుమార్ అన్నారు. పాలకొండ నియోజకవర్గ పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు వైటీసీ సామాజిక భవనం, ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలిచ్చారు. పోలింగ్ రోజు చేపట్టాల్సిన అంశాలు వివరించారు. మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈవీఎంల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిరిష్ట సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. ఏ సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి, తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిరుపేద యువతి పెళ్లికి ఆర్థిక సహాయం



పెళ్లికుమార్తెకు రూ.50వేల చెక్కును అందజేస్తున్న సంఘం సభ్యులు

విజయనగరం టౌన్: పట్టణానికి చెందిన ఓ నిరుపేద యువతి వివాహానికి జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం శుక్రవారం ఆర్థిక సహాయం అందించింది. ఈ మేరకు పెళ్లికుమార్తె ధరణికి రూ.50వేలు అందజేసినట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు టీవీ.శ్రీనివాస్, కూరెళ్ల సరోజిని తెలిపారు. బ్రాహ్మణ కుటుంబాల సంక్షేమానికి బాధ్యతగా ఆర్థిక సహాయం అందించిన సంస్థ ప్రతినిధులకు వధువు, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కార్యర్శులు సరిపల్లి శ్రీనివాస్, గంటి మోహన్, వంకాయలపాటి శ్రీనివాస్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీడని గజరాజుల బెడద



పెదమేరంగి కూడలి వద్ద ఉన్న ప్రధాన రహదారిపై ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని రామినాయుడు వలస పొలిమేరలో గజరాజులు మూడు రోజుల నుంచి కదలడం లేదని రైతులు వాపోతున్నారు. జొన్నపంటను పూర్తిగా ధ్వంసం చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.10 రోజుల్లో చేతి కందనున్న పంటను ధ్వంసం చేయడంతో రైతుల ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. శుక్రవారం మధ్యాహ్న సమయానికి పెదమేరంగి కూడలి వద్ద ఉన్న ప్రధాన రహదారిపైకి ఏనుగులు రావడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సంబంధిత అటవీ సిబ్బంది వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద ఇద్దరు యువకుల దగ్గర నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బృందాలతో కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా కేరళ రాష్ట్రానికి చెందిన శిబిన్ జోసెఫ్, మితలేజ్‌ల కాలేజ్ బ్యాగుల్లో 4.2 గ్రాముల గంజాయిని గుర్తించామన్నారు. గంజాయి విలువ సుమారు రూ.21 వేలు ఉంటుందని, నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామని చెప్పారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



అధికారి వెంకటేష్ మృతదేహం

పార్వతీపురం టౌన్/కొమరాడ: కొమరాడ మండలంలోని మాదలింగి గ్రామంలో ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాదలింగి గ్రామానికి చెందిన అధికారి వెంకటేష్(32) మద్యం తాగి ఇంటికి వచ్చాడని కుటుంబసభ్యులు మందలించడంలో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగేశాడు. ఈ విషయం గమనించిన భార్య, కుటుంబ సభ్యులు కురుపాం ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెక్ పోస్టు ఆకస్మిక తనిఖీ

పాలకొండ: మండలంలోని వెలగవాడ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును కలెక్టర్ నిషాంత్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని డీఎస్పీ జి.వి.కృష్ణారావుకు సూచించారు. చెక్ పోస్టు మీదుగా ప్రయాణం చేసిన వాహనాల వివరాల నమోదు రికార్డును పరిశీలించారు.